



భారతీయ యువజన సంఘం ఆధ్వర్యంలో భోగి మంటలు

సంక్రాంతి సంబురాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబురాలలో నగరవాసులు పాల్గొని సరదాగా గడుపుతున్నారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు, జంగమదేవరలు సందర్శకులను అలరిస్తున్నారు. శనివారం భోగి పండగ సందర్భంగా చిన్నారులకు భోగిపండ్లు పోశారు. బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. దేబ్రసీ పట్నాయక్ శిష్యబృందం ఒడిస్సీ నృత్య ప్రదర్శన ఇచ్చారు. డాక్టర్ కృష్ణకుమార్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గచ్చిబౌలి/రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండాపూర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో రంగనాథస్వామి, గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.ఎన్టీఆర్‌నగర్,గౌలిదొడ్డి, ఖాజాగూడ సాయివైభవ్‌కాలనీ, రాయదుర్గం, కొత్తగూడ, కొండాపూర్, ఇందిరానగర్, వినాయక్‌నగర్ వంటి ప్రాంతాలలోని ఆలయాల్లో అమ్మవారు, స్వామివార్లకు ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

భోగి వేడుక

రాయదుర్గం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మొదటిరోజును భోగి పండగ నేపథ్యంలో రాయదుర్గంలోని వ్యాయామశాల ముందు భారతీయ యువజన సంఘం ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నిఖిల్‌యాదవ్, రవి, అనిల్, సతీష్, అరుణ్, భద్రితో పాటు స్థానికులు పాల్గొన్నారు. ఇదేతరహాలో పలుచోట్ల భోగి మంటలు వేశారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

హఫీజ్‌పేట్ : భోగి పండగను పురస్కరించుకొని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రినగర్‌లోని శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఉదయం దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

మియాపూర్: ధనుర్మాసం చివరిరోజు భోగి పండగను పురస్కరించుకుని శ్రీగోదాదేవి శ్రీరంగనాథ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఉదయం 4.30గంటలకు మేలు కొల్పు హారతితో ప్రారంభమై ప్రత్యేక పూజల అనంతరం కల్యాణం జరిపించారు. సుమారు 40 మంది దంపతులు వేడుకలో పాల్గొన్నారు.



కొండాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం









ఫిలింనగర్ రోడ్ నం.1

కళ తప్పిన రోడ్లు!

బంజారాహిల్స్: సంక్రాంతి పండుగ సందర్భంగా గడిచిన మూడు రోజులుగా నగరవాసులు పల్లెల బాటపట్టారు. దీంతో నగరంలో శనివారం నుంచే రోడ్లపై జనసంచారం తగ్గడంతో బోసిపోయి కనిపించాయి. నిత్యం రద్దీగా కనిపించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఖైరతాబాద్ రహదారులపై వాహనాల రాకపోకలు తగ్గడంతో కళ తప్పాయి. కర్ఫ్యూ విధించారా అన్న రీతిలో రోడ్లు కనిపించాయి.



నృత్యార్చన

మాదాపూర్: అన్నమయ్య స్వరార్చనలో భాగంగా అన్నమయ్యపురంలో శనివారం కళాకారులు నృత్యార్చన చేశారు. భరతనాట్యం, కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురువులు నల్లా రమాదేవి, పద్మావతి శిష్యబృందాలు ఒమిషా, దీక్ష, ధ్రువిత, దిత్యా, సహస్ర, జ్యోత్స్న, దేవి, స్నేహ, శ్రావ్య, సమ్మత,అస్మిత, అని, సీత, లలిత, వేద, శృతి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్యాన్ని అందించేందుకు కొత్త కోర్సులు

- హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు
- హెచ్‌సీయూ–టైమ్స్ ప్రో సంస్థల మధ్య ఒప్పందం



వీసీ బీజేరావు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం

రాయదుర్గం: విద్యతోపాటు నైపుణ్యాలను అందించేందుకు కొత్త కోర్సుల నిర్వహణకు యత్నిస్తున్నామని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో హెచ్‌సీయూ–టైమ్స్‌ప్రో సంస్థల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థుల కోసం కొత్త కోర్సులను అందుబాటులోకి తేవడానికి అవకాశం కలుగుతుందన్నారు. టైమ్స్ ప్రో సీఎఫ్‌ఓ అరుణ్‌కబ్రా మాట్లాడుతూ సవాళ్లను ఎదుర్కొవడానికి, కార్పొరేట్‌లలో ప్లేస్‌మెంట్ కోసం విద్యార్థులను సిద్ధం చేయడానికి వారికి తగిన శిక్షణ ఇవ్వడానికి అవకాశం కలుగుతుందన్నారు. మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లొమో ప్రోగ్రామ్‌లను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ మేరీ జెస్సికా, సీడీపీఎల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ జిలానీ, హెచ్‌సీయూ ప్రతినిధి డాక్టర్ లోకానందరెడ్డి, టైమ్స్‌ప్రో ప్రతినిధులు కుల్‌దీప్ పరేక్, ఎంవిఆర్ పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



మియాపూర్: చందానగర్ డివిజన్‌లోని భవానీపురం కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, రాఘవులు, ప్రభులయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్ధి రామేశ్వరస్వామి జయంతి

మియాపూర్: శేరిలింగంపల్లి డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీలో శనివారం శ్రీ సిద్ధి రామేశ్వర స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేశారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ సమానంగా ఉండాలని కృషి చేసిన మహోన్నత వ్యక్తి రామేశ్వర స్వామి అని అన్నారు. కార్యక్రమంలో స్థానికులు బస్వరాజ్ లింగాయత్, శ్రీకళ, మహేష్ రావస్, కళ్యాణ్, శివ, విజయ్, భీమయ్య పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్‌గా అల్లావుద్దీన్ పటేల్



అల్లావుద్దీన్‌పటేల్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ కృష్ణయాదవ్

గచ్చిబౌలి: ఆమ్‌ఆద్మీ పార్టీ శేరిలింగంపల్లి కన్వీనర్‌గా ఎండిఅల్లావుద్దీన్ పటేల్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం ఆ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ బర్కాకృష్ణ యాదవ్ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ అసెంబ్లీల వారీగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు.

రేగులకుంట.. గుర్రపుడెక్క



రేగులకుంట చెరువులో మురుగునీరు, గుర్రపు డెక్క

మురుగుతో తప్పని దుర్గంధం

మియాపూర్: ఒకప్పుడు తాగు, సాగునీరు అందించిన చెరువులు, కుంటలు ప్రస్తుతం మురికికూపాలుగా మారాయి. వీటి చుట్టూ వెలిసిన కాలనీలు, అపార్ట్‌మెంట్‌ల కారణంగా మురుగుమయం అవుతున్నాయి. దీంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెరువులో గుర్రపు డెక్క ఏపుగా పెరిగి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. చెరువులను సుందరీకరించి పరిసర ప్రాంత కాలనీవాసులకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామంటున్న ప్రజాప్రతినిధుల హామీలు అలాగే మిగిలి పోతున్నాయి.

- దీప్తిశ్రీనగర్‌లోని రేగులకుంట చెరువు పైభాగంలో ఉన్న డంపింగ్ యార్డు, అపార్ట్‌మెంట్‌ల నుంచి మురుగునీరు చెరువులో కలుస్తోంది. దుర్వాసన భరించలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఈ డంపింగ్ యార్డుకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలు, హోటళ్లు, ఆస్పత్రుల నుంచి పెద్ద ఎత్తున చెత్తచెదారం డంప్ చేస్తుంటారు. వీటితో పాటు వర్షకాలంలో డంపింగ్ యార్డులోని వ్యర్థాలు వరదనీటిలో కొట్టుకొంచి చెరువులోకి చేరడంతో పూర్తిగా కలుషితమవుతోంది.
- చెరువు పైభాగంలో ఉన్న పీజెఆర్ ఎన్‌క్లేవ్, జనప్రియ–8 వ్యాలీ, దీప్తిశ్రీనగర్ కొన్ని అపార్ట్‌మెంట్ల నుంచి మురుగునీరు నేరుగా చెరువులోనే చేరుతోంది.
- డంపింగ్ యార్డ్‌కు వచ్చే చెత్త ఆటోలు, డ్రైవర్లు నిర్లక్ష్యంగా చెరువ చుట్టుపక్కల ప్రాంతంలోనే డంప్ చేసి వెళ్తున్నారు. డంపింగ్ చేసిన వాహనాలను ఆ చెరువులోనే కడగడంతో ఆ వ్యర్థాలు అన్ని చెరువులోకి చేరుతున్నాయి.
- కలుషిత జలాల కారణంగా గత వర్షాకాలంలో చెరువులో ఉన్న లక్షల వరకు చేపలు మృతి చెందగా మత్స్యకారులు తీవ్ర నష్టాల పాలయ్యారు.
- డంపింగ్ యార్డ్ నుంచి, అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే మురుగునీరు, వ్యర్థ జలాల మళ్లింపు పనులు చేపట్టకపోవడం, చెరువులో నీటిని పూర్తిగా ఖాళీ చేయకపోవడంతో గుర్రపు డెక్క చెరువంతా నిండి ఏపుగా విస్తరించింది. సాయంకాలం అయితే చాలు ఇళ్లలోకి దోమలు చొరబడి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.
- అధికారులు స్పందించి చెరువులో ఉన్న గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి, మురుగునీరు చేరకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.